

విద్యాపీఠాన్ని సందర్శించిన ప్రభూజీ

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీ సాయిథామ పీఠాదీశ్వరులు రామానంద ప్రభూజీ సందర్శించారు.



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏకే అశ్వనీ కుమార్ ఫలీదా కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు.



శారదాపీఠాధిపతితో ఈఓ

విజయవాడ : విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని శుక్రవారం వైజాగ్‌లో దుర్గగుడి ఈవో రామారావు కలిశారు. అమ్మవారి ప్రసాదాలు, పండ్లు సమర్పించారు.

జెడ్పీ ప్రగతి పద్దు

- రూ.87.97 కోట్లతో జిల్లా పరిషత్ బడ్జెట్ ప్రతిపాదనలు
- ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘంలో ప్రాథమిక ఆమోదం
- వచ్చే సర్వసభ్య సమావేశంలో సమగ్ర చర్చ
- జెడ్పీలో భేటీ అయిన ఏడు స్థాయీ సంఘాలు



జెడ్పీలో స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.87.97 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు శుక్రవారం ప్రవేశపెట్టారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన భేటీ అయిన ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘంలో ప్రతిపాదనలపై చర్చించి ప్రాథమిక ఆమోదం తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఏడు స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగాయి. సమావేశాలకు సంఘాల సభ్యులతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

రూ.55.01 లక్షల మిగులు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.87.97 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌లో ఖర్చులను రూ.87.42 కోట్లుగా చూపిన అధికారులు, రూ.55.01 లక్షలు మిగులుగా చూపించారు. ఇదిలా ఉంటే ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్‌లో రాబడులు, ఆదాయాన్ని రూ.76,12,61,000గా ఖరారు చేసిన పాలకవర్గం వ్యయం, ఖర్చులను రూ.75,61,28,000గా చూపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం జెడ్పీ బడ్జెట్ ప్రతిపాదనలకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖల ఖర్చులనూ కలిపి ఆమోదించాల్సి ఉన్నందున రూ.781 కోట్లను కొత్తగా చేర్చారు. దీంతో మొత్తం వార్షిక బడ్జెట్ రూ.869 కోట్లకు చేరింది. ఇందులో కేవలం జెడ్పీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని రూ.87.97 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘం ప్రాథమికంగా ఆమోదిస్తూ వచ్చే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సమగ్రంగా చర్చించేందుకు నిర్ణయించింది.

15వ ఆర్థిక సంఘ నిధుల కోసం నిరీక్షణ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించేందుకు 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర నిధుల కోసం జెడ్పీ పాలకవర్గం ఎదురు చూస్తోంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులను పొందుపర్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.40 కోట్లుగా చూపిన అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.45 కోట్లు రావచ్చునని అంచనా వేశారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో నిధులు వస్తాయని అంచనాలు వేశారు.

మూడు జిల్లాల డీఈఓలు, ఆర్జేడీ గైర్హాజరుపై ఆగ్రహం

విద్య–వైద్యంపై జరిగిన స్థాయీ సంఘ సమావేశానికి మూడు జిల్లాల డీఈఓలతోపాటు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గైర్హాజరు కావడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులు గైర్హాజరుకావడం తగదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగళాయపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంను అకారణంగా సస్పెండ్ చేశారని లక్ష్మణరావు ఆరోపించారు. విద్యాశాఖాధికారుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంటూరు జోన్ ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గుంటూరులో అందుబాటులో ఉండటం లేదన్నారు.

మధ్యలో వెళ్లిపోయిన జెడ్పీటీసీ గుల్జార్ బేగం

కాకుమానులోని బాలికల హాస్టల్‌కు తాగునీటి వసతి కల్పనలో అధికారుల నిర్లక్ష్యంపై జెడ్పీటీసీ గుల్జార్ బేగం ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి ఇదే సమస్యపై పదే, పదే సమావేశాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా ఆమె సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. హాస్టల్లో తాగునీటి వసతి కోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించినప్పటికీ అధికారులు పనులు చేపట్టకపోవడంపై హెనీ క్రిస్టినాతోపాటు సీఈవో జె. మోహనరావు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు

- అండర్–17 బాలుర విభాగంలో విజేత గుంటూరు, రన్నర్ శ్రీకాకుళం
- బాలికల విభాగంలో విన్నర్ ప్రకాశం, రన్నర్ విజయనగరం



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా జట్టు

పెదకాకాని: క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు చెప్పారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమైన మూడు రోజుల 67వ ఏపీ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్–17 బాలబాలికల విభాగాలలో జరిగిన ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 500 క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ఆటతీరును ప్రదర్శించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా శ్రీకాకుళం జట్టు నిలిచింది. విజయనగరం జట్టు తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే అండర్–17 బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విన్నర్ కాగా విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని శ్రీకాకుళం జట్టు దక్కించుకుంది. విజేతలకు పతకాలు బహూకరించడంతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. విన్నర్, రన్నర్ స్థానాల్లో నిలిచిన జట్లకు గోల్డ్ కప్‌లు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో జరిగే బేస్‌బాల్ పోటీలకు అండర్ 17 బాలబాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరం మస్తాన్ రెడ్డి తెలిపారు. విజేతలకు రాష్ట్ర పాఠ్యపుస్తక డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ తాళ్ళ వెంకటేష్ యాదవ్, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరు తిరుపతిరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.నాగజ్యోతి, టోర్నమెంట్ పరిశీలకులు హృదయ రాజు, జయరావు, జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ మేనేజర్లు, వ్యాయామోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెనిగండ్లలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

పెదకాకాని: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు వెనిగండ్లలో నిర్వహించనున్నట్లు పీఈటీ, పోటీల నిర్వాహక కమిటీ కార్యదర్శి బేరం మస్తాన్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం నంబూరు తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. స్థానిక వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో అండర్– 14 బాలబాలికల జట్లు పాల్గొంటాయని చెప్పారు. క్రీడాకారులు 13 జిల్లాల నుంచి సుమారు 480 మంది, 50 మంది కోచ్ మేనేజర్లు, 50 మంది జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు హాజరవుతారని వివరించారు. మూడు రోజుల పాటు లీగ్ కం నాకౌట్ పద్ధతుల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.

జర్మనీలో ఉద్యోగ అవకాశాల నిమిత్తం యువతకు శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): జర్మనీలో ఉద్యోగ అవకాశాల కల్పన నిమిత్తం బీఎస్సీ నర్సింగ్ చదివిన యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రైనింగ్ అండ్ ఇంటర్నేషనల్ ప్లేస్మెంట్స్ స్కిల్ కాలేజ్ ఫర్ హెల్త్ కేర్ వర్కర్స్ అండ్ నర్సస్ కార్యక్రమం ద్వారా డీడీయూజీకేవై శిక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. 20 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉండి బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6302096189 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐల బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ (పీఎస్) సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.అక్కేశ్వరరావుని బాపట్ల జిల్లాలోని మార్టూరు సర్కిల్ పీఎస్‌కు, గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ కుమ్మరి శ్రీనివాసరావుని గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు.

రేపు సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక ఆదివారం నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల న్యూ క్యాంపస్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సెలక్షన్స్ ప్రారంభమవుతాయని తెలిపారు. సీనియర్ బాలబాలికలు సెలక్షన్స్‌కు హాజరుకావచ్చన్నారు. వయస్సుతో నిమిత్తం లేదని అడ్రస్ ధ్రువీకరణ కోసం ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని అన్నారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు మార్కాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. వివరాలకు కె.ఆదిబాబు, 9985373066ను సంప్రదించవచ్చన్నారు.

జలజీవన్ మిషన్, జగనన్న గృహ నిర్మాణాలపై సమీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రామీణ నీటి సరఫరా–పారిశుద్ధ్య శాఖ ఇంజినీర్లతో శుక్రవారం జలజీవన్ మిషన్, జగనన్న గృహ నిర్మాణాలపై ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్వీ కృష్ణారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయా కార్యక్రమాల ప్రగతిపై ఇంజినీర్లతో చర్చించారు. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో గుంటూరు జిల్లా ఎస్ఈ ఆర్.సురేష్, పల్నాడు డీఆర్ఈ ఆర్ఎస్ఆర్ సురేష్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేపు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో జిల్లా స్థాయి సీనియర్ మెన్, ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి వచ్చేనెల 8 నుంచి 10 వరకు అనంతపూర్ జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామంలో జరగబోయే రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాల కోసం 93969 90666 సంప్రదించాలన్నారు.

నేడు కుల గణన సర్వేపై ప్రత్యేక సమావేశం

నెహ్రూ నగర్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన కులగణన సర్వేపై శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, స్టాక్ హోల్డర్స్‌తో రెవెన్యూ కల్యాణ మండపంలో అభిప్రాయ సేకరణ, సూచన నిమిత్తం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారని వివరించారు.

యార్డులో 26,755 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,425 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,755 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,100 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 27,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.12,800 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 8,772 బస్తాల మిర్చి నిల్వ ఉంది.





నాగేంద్రునికి విన్నపాలు

నాగుల చవితి సంబరాలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు నాగేంద్రుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. పుట్టల వద్ద గంటల తరబడి బారులుతీరి పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. విన్నపాలు మొరపెట్టారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలోని నాగేంద్రునికి పుట్ట వద్ద భక్తులు అధికసంఖ్యలో పాలుపోశారు. తొలుత కృష్ణానదిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించారు. ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరికి కుంకుమపూజలు చేశారు. – అమరావతి

సామాజిక న్యాయానికి పెద్దపీట

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- అట్టహాసంగా తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవరావు పదవీ ప్రమాణ స్వీకారోత్సవం
- రాష్ట్రంలోనే తొలిగా రజకులకు తెనాలి ఎంపీపీ పదవి
- చారిత్రాత్మకమని కీర్తించిన నేతలు



ప్రమాణ స్వీకారం అనంతరం ధ్రువీకరణ పత్రంతో ధర్మరాజుల చెన్నకేశవరావు, ఎంపీ మోపిదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక సాధికారత, సమన్యాయానికి తెనాలి నియోజకవర్గం అచ్చమైన నిదర్శనమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. తెనాలి ఎంపీపీగా రజక సంఘీయుడైన ధర్మరాజుల చెన్నకేశవరావు ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం మధ్యాహ్నం అట్టహాసంగా జరిగింది. సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మోపిదేవి మాట్లాడుతూ రాజకీయ చైతన్యానికి తెనాలి ప్రతీకని, ఉద్దండులకు జన్మనిచ్చిన ఈ గడ్డలో కొన్నిరోజులుగా బీసీ వర్గాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. ఎప్పుడూ అవకాశాలు రాని కులాలకు ప్రజాప్రతినిధులుగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పదవీయోగం కల్పించారని, ఇందుకు కారకులైన ఎమ్మెల్యే శివకుమార్‌కు కృతజ్ఞతతో ఉండాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఇంతకాలం ఓటు బ్యాంకుగానే ఉన్నాయని, జెండాలు మోయటం, కొట్లాడుకోవటం, కేసులు పెట్టించుకోవటానికి మినహా వారికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు. వీరంతా సగౌరవంగా తలెత్తుకు తిరిగేలా చేస్తానంటూ ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రూ.2.38 లక్షల కోట్ల సంక్షేమ లబ్ధిని చేకూర్చినట్టు గుర్తుచేశారు. వారిని మంత్రులు, ఎమ్మెల్సీలతో సహా అనేక పదవుల్లోకి తీసుకున్నారని చెప్పారు. అందుకే రాష్ట్రంలో సామాజిక సాధికార బస్సు యాత్రలు జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించిన గౌరవాన్ని బహుజనులు సగర్వంగా చెప్పుకుంటున్నారని మోపిదేవి చెప్పారు. అణగారిన వర్గాలకు ఎవరు మేలు చేస్తున్నదీ ఆత్మపరిశీలన చేసుకోవాలని, 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే శివకుమార్‌కు అండగా నిలవాలని కోరారు. ఎవరెన్ని పొత్తులు, కలయికలు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావటం ఖాయమన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా రజక సంఘీయుడికి తెనాలి ఎంపీపీ పదవిని కల్పించటం చారిత్రాత్మకమని అభివర్ణించారు. సమాజానికి సేవచేస్తున్న రజకులకు రాజకీయంగా ఎవరూ సహకరించలేదని చెబుతూ శివకుమార్ నాయకత్వంలో తెనాలి నుంచి చెన్నకేశవరావు ఎన్నిక గొప్పదిగా చెప్పారు. భవిష్యత్‌లో రజకులకు రాష్ట్రంలో మరిన్ని ఉన్నత పదవులు దక్కుతాయన్నారు.

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రజలు కల్పించిన అవకాశంతో బడుగు బలహీనవర్గాలకు సామాజిక సమన్యాయాన్ని ఆచరణలో చూపగలుగుతున్నట్టు చెప్పారు. ఓసీ మహిళకు రిజర్వు అయిన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ముస్లిం మైనారిటీ సోదరికి కేటాయించి, రెండోపర్యాయం బీసీ యాదవ మహిళను ఎంపిక చేశామన్నారు. రాష్ట్రంలోనే తొలిగా రజక వర్గీయుడైన ధర్మరాజుల చెన్నకేశవరావును తెనాలి ఎంపీపీ పదవికి ఎంపిక చేశామన్నారు. నియోజకవర్గంలో రూ.1,800 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. రాష్ట్ర రజకసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు మాట్లాడుతూ రజక వర్గానికి రాష్ట్రంలోనే తొలిగా ఎంపీపీ పదవి దక్కినట్టు చెప్పారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ రజకులకు కల్పించాల్సిన సౌకర్యాలను వివరించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవరావు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమర్థంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. పోతావఝుల పురుషోత్తమశర్మ స్వాగతం పలికిన సభలో రజక సంఘ రాష్ట్ర నాయకుడు నాగమల్లేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, గెద్దేటి సురేంద్ర, ఓలేటి శివాజీ, అవుతు పోతిరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, డాక్టర్ రియాజ్‌ఖాన్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, ప్రసాదం బాలగురవమ్మ, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, గెద్దేటి ఝాన్సీవాణి, వైకుంఠపురం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, అద్దంకి బోసుబాబు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. తొలుత ధర్మరాజుల చెన్నకేశవరావు స్వగ్రామమైన సోమసుందరపాలెం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ రాజశేఖర్
- రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటునన వీసీ రాజశేఖర్, చిత్రంలో వీవీఐటీ చైర్మెన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

ఏఎన్‌యూ(గుంటూరు): యూనివర్సిటీలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలను శుక్రవారం సాయంత్రం వీసీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ఏఎన్‌యూ వేదికగా అనేక జాతీయ, జోనల్ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. క్రీడా రంగంలో దేశానికే తలమానికంగా నిలిచే అనేక మౌలిక వసతులు ఏఎన్‌యూలో ఉన్నాయని తెలిపారు.

ఏఎన్‌యూకు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బి హరి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్, మాజీ డైరెక్టర్ ఆచార్య వై.కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీలలో పాల్గొంటున్న జట్ల క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకున్నారు.

తొలిరోజు పోటీల వివరాలు

తొలిరోజు ఈస్ట్ గోదావరి నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో ఈస్ట్ గోదావరి 30:27 తేడాతో విజయం సాధించింది. కోనసీమ, నంద్యాల జిల్లాల మధ్య జరిగిన పోటీలో నంద్యాల జిల్లా 37: 17 తేడాతోను, విశాఖపట్నం, కర్నూలు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జట్టు 55: 21 పాయింట్లతోను, అనకాపల్లి, అన్నమయ్య జిల్లాల మధ్య పోటీలో అనకాపల్లి జిల్లా 37: 27 తేడాతో విజయం సాధించాయి.

జగనన్న కాలనీలు చక్కగా ఉన్నాయి

- కేంద్ర బృందం కితాబు
- ఇప్పటంలో గృహాల సందర్శన
- లబ్ధిదారులతో వివరాల సేకరణ



ఇప్పటం జగనన్న కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న కేంద్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రీజినల్ కో–ఆర్డినేటర్ సునీల్ ఫరూక్

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలోని నివాసాలను శుక్రవారం కేంద్ర బృందం పరిశీలించింది. ఇప్పటంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పేద ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కేంద్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రీజినల్ కో– ఆర్డినేటర్ సునీల్ ఫరూక్ తన బృందంతో పరిశీలించారు. ఇప్పటంలో మొత్తం 35 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించగా అందులో ఇప్పటికే 28 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. గృహిణులతో సునీల్ ఫరూక్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా సొంత ఇల్లు లేనివారికి ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లు చాలా అందంగా ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.1లక్షా 75 వేలు అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు మౌలిక సదుపాయాలైన కరెంటు, రోడ్లు, మంచి నీటి సౌకర్యాలు కల్పిస్తోందని, అదనంగా రూ.30 వేలతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు రూ.12 వేలు, డ్వాక్రా సంఘాల నుంచి మరికొంత నగదు అందజేస్తున్నట్టు తెలిసిందన్నారు. కార్యక్రమంలో కేంద్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు మనీష్, ఏపీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారి నాగభూషణం, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. వేణుగోపాలరావు, రిటైర్డ్ ఎఎస్సీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య గులాబీ రంగు పురుగువల్లే!

- రైతులు సమష్టిగా నియంత్రణకు పూనుకోవాలి
- యాజమాన్య పద్ధతులతోనే నాణ్యమైన పత్తిదిగుబడి సాధ్యం
- కేంద్ర పత్తి పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ వై.జి.ప్రసాద్


క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: దేశంలో పత్తి పండించే అన్ని రాష్ట్రాల్లో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు తీవ్ర సమస్యగా మారిందనీ, రైతులందరూ సమిష్టిగా ఈ పురుగును నియంత్రించాలని కేంద్ర పత్తి పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ వై.జి.ప్రసాద్ సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 సంవత్సరాల సంబరాల్లో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం పత్తి విభాగం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయి పరిశోధన దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం నిడుముక్కల గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కేంద్ర పత్తి పరిశోధన ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రాంతంలోని రైతులందరూ పత్తి పంటను ఒకేసారి విత్తడం ద్వారా మాత్రమే ఈ పురుగును నివారించుకోవచ్చన్నారు. నాణ్యమైన పత్తిని పొందాలంటే మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగుల సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో పీబీనాట్స్(ముడులు) వాడటం ద్వారా సంపర్కాన్ని నిరోధించి గులాబీరంగు పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. పీబీనాట్స్ వాడి పత్తి పొలాలను రైతులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో లాంఫాం ఏడీఆర్ డాక్టర్ జీవీ ప్రసాదరావు, సౌత్ ఆసియా బయోటెక్నాలజీ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ భగీరథ్ చౌదరి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్‌గుజర్, కాటన్ కార్పొరేషన్ డీడీఈ స్వప్నిత్, జిల్లా ఫిబినాట్స్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ డాక్టర్ దయానా, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి శ్రీలక్ష్మి, డాక్టర్ ఎం సుధారాణి, డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ కె శివారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌మోహన్, వీపీఏ రవి, రైతులు తదితరులున్నారు.

49 మంది స్టాఫ్‌నర్సుల నియామకం


నర్సులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఆర్‌డి శోభారాణి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో శుక్రవారం స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియ జరిగింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించి శుక్రవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి ఉద్యోగాలకు అర్హులైన వారికి నియామకపు ఉత్తర్వులు ఆర్డీ డాక్టర్ శోభారాణి అందజేశారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో 60 స్టాఫ్‌నర్సుల పోస్టుల భర్తీకి మెరిట్ ప్రాతిపదికన కౌన్సిలింగ్‌కు అభ్యర్థులను పిలిచారు. వీరిలో 49 మంది శుక్రవారం కౌన్సెలింగ్‌కు హాజరై నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. ఒకరు స్పోర్ట్స్ కోటా ఎంపిక అవగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వెయిటింగ్ లిస్టులో పెట్టారు. పది మంది అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు గైర్హాజరయ్యారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్‌షరీఫ్ పాల్గొన్నారు.

స్పెషల్ కేటగిరి విద్యార్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కళాశాలల్లో బీఎస్సీ(హ్యాన్స్) అగ్రికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం స్పెషల్ కేటగిరి విద్యార్థులకు ఏపీ అగ్రిసెట్- 2023 ర్యాంకుల ఆధారంగా డిప్లొమో హోల్డర్స్‌కు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన ఏపీజీసీ సెమినార్ హాలు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం గుంటూరులో ఈ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. స్పెషల్ కేటగిరి పీహెచ్, ఎన్‌సీసీ, సీఏపీ, స్పోర్ట్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న ప్రయారిటీలో ఉన్న విద్యార్థులకు సీట్లను భర్తీ చేయటం జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ట్రావెల్స్ కారు చోరీ

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల సమీపంలోని ఆర్ ఆర్ కార్ ట్రావెల్స్‌కు చెందిన కారు చోరీకి గురైంది. ఈ మేరకు ట్రావెల్ నిర్వాహకుడు వజ్జా బ్రహ్మయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో కార్యాలయం మూసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం కారు ట్రావెల్స్ రాగా, కార్యాలయం తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కారు తాళాలు తీసుకుని కారుతో ఉడాయించినట్లు గుర్తించాడు. సీసీ కెమెరాలకు సంబంధించిన టీవీ, రికార్డర్‌తో పాటూ మరో కలర్ టీవీ, సెల్‌ఫోన్ చార్జర్లు, రెంచీల కిట్‌ను కారులో పెట్టుకుని వెళ్లినట్లు గుర్తించారు. రాత్రి 12 గంటల సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారని బయట ఉన్న లైట్లు ఆపివేసి చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. కారు విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందన్నారు. చోరీకి గురైన సమయంలో అదే ఆవరణలో మరో మూడు కార్లు ఉన్నాయని, వాటి తాళాలు కూడా చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఈ ట్రావెల్స్ ఎదురుగా ఉన్న మరో ట్రావెల్స్‌లో కూడా కారు చోరీకి గురి కాగా, కారుపైనున్న స్టిక్కర్ సాయంతో ఒంగోలులో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం జరగాలి

కేంద్ర సంయుక్త కార్యదర్శి సోలమన్ ఆరోక్యరాజ్


మాట్లాడుతున్న కార్యదర్శి సోలమన్ ఆరోక్యరాజ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి సోలమన్ ఆరోక్యరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమం జనవరి 26 వరకు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమానికి నోడల్ అధికారిని నియమించాలనీ, కార్యక్రమ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 60 రోజుల్లో 258 గ్రామాలు, మున్సిపాలిటీల్లో 20 రోజుల్లో 40 ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించేలా రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. జిల్లా స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులుగా 37 మందితోనూ, మండలస్థాయి అధికారులు 17 మందితో మండల కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమ నిర్వహణా బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ప్రాంతంలోనూ పాల్గొనేలా సచివాలయ సిబ్బందితోపాటు వలంటీర్లు పాల్గొనేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

రబీలో పప్పు ధాన్యాల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో రబీలో సాగునీటి కొరత కొంత ఉంటుందని, దీనిని జిల్లా రైతాంగం గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో వీడియో సమావేశ మందిరంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రబీలో నీటి అవసరం తక్కువగా ఉండి, పప్పు ధాన్య రకాలైన మినుము, పెసర పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో 26.13, పులిచింతల ప్రాజెక్టులో 10.29, శ్రీశైలం జలాశయంలో 10.20 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని తాగునీరు అవసరాలకు మాత్రమే వినియోగించనున్నామన్నారు. రబీలో నాగార్జున సాగర్ ఆయకట్టు, కృష్ణ వెస్ట్ డెల్టా ఆయకట్టుకు సాగునీరు సరఫరా జరగదని ఇరిగేషన్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత రైతులు నీటి అవసరం లేని శనగ, మినుములు, కృష్ణా, వెస్ట్ డెల్టా ఆయకట్టు రైతులు మినుము, పెసర పంటలు సాగు చేయాలన్నారు. నీటి ఎద్దడి నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల స్థాయి, మండల స్థాయిలో వారం లోపు వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అధికారులకు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.శివరామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డి.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ ఉమా మహేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై ఆర్డీవో విచారణ

అద్దంకి రూరల్: వైద్యురాలి నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటనపై అధికారులు విచారణ జరిపారు. ఇటీవల అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యురాలి నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటనపై మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం చీరాల ఆర్డీవో సరోజిని స్థానిక వైద్యశాలలో విచారణ చేపట్టారు. వైద్యురాలు, ఫిర్యాదుదారుల నుంచి, వైద్యశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవోతో విచారణకు వచ్చిన డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు వైద్యురాలిపై ఫిర్యాదు చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు


మాట్లాడుతున్న ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్

ఏఎన్‌యూ: జర్నలిజంలో గడిచిన మూడు దశాబ్దాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఎవల్యూషన్ ఆఫ్ ప్రెస్ ఇన్ లాస్ట్ ఫ్యూ డికెట్స్ అనే అంశంపై కిరణ్ కుమార్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యూస్‌కు బదులుగా వ్యూస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది జర్నలిజానికి సరితూగదని కేవలం న్యూస్‌కి జర్నలిజం, పత్రికలు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జర్నలిజం అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత నెలకొందని, సాంకేతికత పరమైన అంశాలలో దినదినాభివృద్ధి జరుగుతుందని వివరించారు. పత్రికలు, పాత్రికేయుల్లో కూడా అభివృద్ధిని అందిపుచ్చుకొని విస్తృత కృషి చేయాలని సూచించారు. గతంలో ఏదైనా వార్తలు రావాలంటే కేవలం పత్రికల్లో మాత్రమే వచ్చేవని నేడు అది రూపాంతరం చెంది సోషల్ మీడియా పేరిట తన స్వరూపాన్ని మార్చుకుందని చెప్పారు. దీంతో ప్రతి ఒక్కరూ జర్నలిజం చేసే వీలును ఈ సాంకేతికత మార్పు కల్పించిందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలన్నీ నిజమని నమ్మవద్దని వాటిని పరిశీలించిన తర్వాత మాత్రమే ప్రతి చర్య ఉండాలని సూచించారు. కొన్ని సందర్భాలలో చాలా సున్నిత అంశాలు కూడా భయభ్రాంతులకు గురి చేసే విధంగా సోషల్ మీడియా ఉంటుందని దానిని గమనించాల్సిన అవసరం ఉన్న పాత్రికేయులకు, రాబోవు తరానికి ఎంతో అవసరం అన్నారు. డెవలప్‌మెంట్ జర్నలిజంలో ఎక్కువ స్కోపు ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రజా సంబంధాలు సమాచార సేకరణ విషయాలలో సంస్థల్లో పని చేసే ప్రజా సంబంధాల అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేవలం సంస్థ మనుగడకు వారు కృషి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని వివరించారు. కార్యక్రమానికి జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ కె.మధుబాబు, డాక్టర్ మాణిక్యరావు పాల్గొన్నారు.

నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ షురూ

గుంటూరు మెడికల్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రి.నంబర్ 21/1973 ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు కర్నూల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రధాన ఆచార్యులు ఎస్.జ్యోతి, గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు పద్మావతీ ఎన్నికల షెడ్యూల్ శుక్రవారం ప్రకటించారు. అక్టోబర్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. అర్హత కలిగిన నర్సింగ్ అసోసియేషన్ సభ్యులందరూ నామినేషన్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. అసోసియేషన్ చట్ట ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఐదు సంవత్సరాల సభ్యత్వం 2024 జనవరి 1 నాటికి మూడు సంవత్సరాలు పదవి విరమణ తేదీనాటికి ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులన్నారు.

అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది కింద తెలుపబడిన పదవులకు ఎన్నికల అధికారులకు నామినేషన్ దాఖల చేయాలన్నారు. అధ్యక్షులు-1, కార్యదర్శి-1, కోశాధికారి-1, జిల్లా ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్ర ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లా ఎన్నికల నామినేషన్ తేదీ ఈనెల 25, ఎన్నికల తేదీ డిసెంబరు 13ని చెప్పారు.

ష్యూరిటీగా గొడవ - గ్యారంటీగా నిరసన!

- గుంటూరులో టీడీపీ-జనసేన మధ్య ఫ్లెక్సీ వివాదం
- కార్యక్రమానికి రాలేమన్న జన'సేన'
- వెనుదిరిగిన తెదేపా నాయకులు

నగరంపాలెం: టీడీపీ నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ' అనే కార్యక్రమం టీడీపీ, జనసేన నాయకుల మధ్య గొడవకు దారితీసింది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఫొటో మినహా గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఇతర నాయకుల ఫొటోలు లేకపోవడమే వివాదానికి కారణమైంది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం గుంటూరు నగరంలోని 18వ డివిజన్ శ్రీనివాసరావుపేట ఆరో వీధిలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం ఉందంటూ వారి గ్రూప్‌ల్లో పోస్ట్ చేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. అయితే ఆ పోస్ట్‌లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు ఉండగా, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు బోనబోయిన శ్రీనివాసరావు ఫొటోలు ముద్రించకపోవడంతో గొడవకు దారితీసింది. ఈలోగా బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమ నిర్వహించేందుకు టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొవెలమూడి రవీంద్ర (నాని), నాయకులు తాళ్ళ వెంకటేష్ యాదవ్‌తోపాటు పలువురు శ్రీనివాసరావు పేటకు చేరుకున్నారు. అయితే అక్కడ జనసేన సైనికులు ఎవరూ కనిపించలేదు. దీనిపై కోవెలమూడి నాని ఆరాతీశారు. ఈలోగా జనసేన డివిజన్ నాయకులను ఫోన్లల్లో సంప్రదించారు. జనసేన జిల్లా నాయకులు ఫొటోల్లేవని, ప్రొటోకాల్ పాటించనప్పుడు అక్కడికి హాజరు కాలేమని బదులిచ్చారు. దీంతో టీడీపీ నాయకులకు ఏం చేయాలో అర్థం కాక అక్కడి నుంచి వెనుదిరిగారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం


అదాలత్‌లో సమస్య వింటున్న చైర్మన్ ఇమ్మానుయేలు, సభ్యులు

నరసరావుపేట: విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నట్లు ఏపీ విద్యుత్ వినియోగదారుల అదాలత్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు తెలిపారు. ఏపీ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ శుక్రవారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అధిక బిల్లులు, కాలిపోయిన మీటర్లు, సర్వీసులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయటం, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, వంగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్స్ సమస్య పరిష్కరించటం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా పది కేసులను పరిష్కరించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు కార్తికేయ ఎంపిక

నిజాంపట్నం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పీతా కార్తికేయ ఎంపిక కావడం హర్షణీయమని కోచ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన స్టైర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో రేపల్లె బోధి ధర్మ జిమ్, తైక్వాండో అకాడమీలో జరిగాయి. పోటీల్లో గుంటూరు జిల్లా టీమ్ తరపున నిజాంపట్నంకు చెందిన పీతా కార్తికేయ బంగారు పతకాన్ని సాధించగా, పీతా తనూష వెండి పతకం సాధించిది.బంగారు పతకాన్ని సాధించిన పీతా కార్తికేయ నవంబర్ 30 నుంచి జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థినిలను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబు, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, ఏపీ సీఫుడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొలిశెట్టి రామకృష్ణ తదితరులు అభినందించారు.

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంది చంద్రబాబే

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



పట్నంబజారు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పార్టీ నేతలకు బడుగు, బలహీన వర్గాలంటే తొలి నుంచి చిన్న చూపేనని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మండి పడ్డారు. గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు పార్థసారథి వడ్డెరలను అవమానించేలా చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వడ్డెర జాతిని కించపరిచేలా పార్థసారథి వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డెర జాతి ప్రజలు నాటి కాలంలో వడ్డెర ఓబన్న మొదలుకొని నేటి వరకు వెన్నుచూపిన వీరులుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ, జనసేన సమన్వయ సమావేశంలో వడ్డెర కులస్తులపై చేసిన వ్యాఖ్యలు పూర్తి స్థాయిలో ఆక్షేపమన్నారు. టీడీపీ నేతలను వడ్డెరలపై ఉసిగొలుపుతున్న చంద్రబాబు కూడా వడ్డెర జాతికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ బీసీలను కేవలం ఓటు బ్యాంకులా చూసిందని మండి పడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని రంగాల్లో వారికి పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. నామినేటెడ్ పదవులు మొదలు, కేబినెట్ పదవుల వరకు బీసీలకు అందజేసి తాను బీసీల పక్షపాతినని సీఎం వై.ఎస్.జగన్ చాటి చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం బీసీ వర్గాలు సీఎం వై.ఎస్.జగన్‌కు అండగా నిలబడి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వడ్డెర జాతికి పార్థసారథి క్షమాపణలు చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

రైతులకు అవసరమైన ఎరువులు అందించాలి

- వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు
- యడ్లపాడు ఆర్‌బీకే ఆకస్మిక తనిఖీ


యడ్లపాడులోని గోదాములో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

యడ్లపాడు: విత్తనం మొదలు పంట విక్రయం వరకు రైతులకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ సచివాలయం(ఎరువుల విభాగం) డెప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు చెప్పారు. ఎరువులు తనిఖీ రాష్ట్ర అధికారుల బృందం శుక్రవారం యడ్లపాడు గ్రామాన్ని పరిశీలించారు. స్థానిక గ్రామ సచివాలయం- 1 పరిధిలోని ఆర్‌బీకేను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత కియోస్కో ద్వారా నిర్వహించిన ఎరువుల లభ్యత, విక్రయాలు, ప్రస్తుతం అందుబాటులో నిల్వలు, అమ్మకాల రికార్డుల్లో వాటి నమోదు విషయాలను గురించి వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. నేరుగా రైతుల ఖాతాలకు సబ్సిడీ వర్తింపజేసే (డీబీటీ) ఆన్‌లైన్‌లోని జాబితాలను పరిశీలించారు. గోదాముల్లోని ప్రస్తుత ఎరువుల నిల్వ సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల పరిధిలో సీజన్‌ల వారీగా రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలకు అనుగుణంగా ఎరువులు అందించేలా చూడాలన్నారు. నిల్వల్లో వ్యత్యాసాలు లేకుండా ఎప్పటికప్పుడు రికార్డుల సక్రమంగా చూసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులను సకాలంలో తెప్పించి వారికి అందించడంలో సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఎరువులకు సంబంధించి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సచివాలయం(ఫర్టిలైజర్ సెక్షన్) ఏడీఏ రాజన్, ఏఓ జి.సురేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఏడీఏ సీహెచ్ రవికుమార్, యడ్లపాడు ఏఓ సీహెచ్ సరిత ఉన్నారు.

సహకార రంగం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోంది

చీరాల రూరల్: సహకార రంగం ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు విస్తరిస్తోందని జిల్లా పీడీసీసీ బ్యాంక్ సహకారశాఖ ఆడిట్ అధికారి యలమంద రావు అన్నారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు చీరాల శాఖ కార్యాలయంలో శుక్రవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వారోత్సవాల జెండా, సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సహకార రంగం రైతులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సహకార రంగం విశిష్టతను వివరించారు. చీరాల శాఖ మేనేజర్ వాసుదేవ్‌సింగ్ అధ్యక్షత వహించిన సభలో చీరాల ఆర్వో చీఫ్ మేనేజర్ నరసింహా, బాపట్ల జిల్లా ఆడిట్ ఆఫీస్ సూపరింటెండెంట్ కోటి వీరయ్య, చీరాల సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీస్ పర్యవేక్షకుడు సుధాకర్ పాల్గొన్నారు.